కంకర రోడ్డు తారుగా మారేదెప్పుడు?

- అధ్వానంగా మారిన చందాపూర్– కన్‌కల్ రహదారి
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


కంకర తేలి అధ్వానంగా మారిన చందాపూర్ రోడ్డు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చందాపూర్ గ్రామం నుంచి కన్‌కల్ గ్రామం వరకు ఉన్న రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డును తారు రోడ్డుగా మార్చినట్లయితే నాలుగు మండలాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు.

ఏ వాహనాలు వెళ్లలేని పరిస్థితి

ఈ రోడ్డు తార్‌రోడ్డుగా మార్చి నట్లయితే తాడ్వాయి మండల ప్రజలకే కాకుండా సదాశివనగర్, గాంధారి, కామారెడ్డి మండల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. చందాపూర్ సంగోజివాడి, కాలోజివాడి, బ్రాహ్మణపల్లి గ్రామాల ప్రజలు కన్‌కల్, కరడ్‌పల్లి, దేమికలాన్‌తోపాటు గాంధారి మండల కేంద్రానికి వెళ్లాలంటే వయా తాడ్వాయి, సదాశినగర్ మీదుగా వెళ్లాల్సి వస్తుంది. కన్‌కల్, కరడ్‌పల్లి, దేమికలాన్ గ్రామస్తులు సదాశివనగర్ వెళ్లాలంటే తాడ్వాయి, కామారెడ్డి మీదుగా వెళ్లాల్సి వస్తుంది. ఇక్కడి ప్రజలు గాంధారిలో ఆదివారం సంతకు వెళ్తుంటారు. ఈ రోడ్డును తారు రోడ్డుగా మార్చినట్లయితే కామారెడ్డి డిపో నుంచి నేరుగా కరడ్‌పల్లి, గాంధారి వరకు ఆర్టీసీ బస్సులను నడిపించవచ్చు. పలు గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గడమే కాకుండా తక్కువ డబ్బులకే ప్రయాణం చేయవచ్చు. కానీ ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో బైక్‌లు తప్ప ఇతర ఏ వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చందాపూర్ నుంచి కన్‌కల్ వరకు ఉన్న కంకర రోడ్డును తారు రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి..



అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని ఈ రోడ్డును తారు రోడ్డుగా మార్చాలి. ఎన్నో సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని మా సమస్యలు తీర్చాలి. –పైడి విశాల్‌రెడ్డి చందాపూర్

వేరే వాహనాలు వెళ్లలేవు..



కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టించుకొని ఈ రోడ్డును తారు రోడ్డుగా మార్చాలి. ఈ రోడ్డు బాగుపడితే ఇతర గ్రామాలకే కాకుండా వ్యవసాయ పనుల కోసం రైతులు సులువుగా పొలాల వద్దకు వెళ్లవచ్చు. ప్రస్తుతం ఈ రోడ్డుపై బైక్‌లు తప్ప ఇతర వాహనాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. –రాములు, చందాపూర్

నా దృష్టికి రాలేదు..

తాడ్వాయి మండలానికి కొత్తగా వచ్చాను. మండలంలోని చందాపూర్ నుంచి కన్‌కల్‌కు ఉన్న రోడ్డు విషయమై నా దృష్టికి రాలేదు. త్వరలోనే ఆ రోడ్డును పరిశీలించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళతాను. –కల్పన, పంచాయతీరాజ్ ఏఈ

క్లుప్తంగా

పంట రుణాలు మాఫీ చేయాలి



నిజాంసాగర్(జుక్కల్): బ్యాంకుల ద్వారా తీసుకున్న పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని మల్లూర్ సొసైటీ చైర్మన్ ఒంటరి కళ్యాణి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని మల్లూర్ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనివారం సొసైటీ చైర్మన్ కళ్యాణి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకంలో చాలా మంది రైతులకు రుణాలు మాఫీ కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో ఉన్న కొనుగోలు కేంద్రాలను ఐకేపీ మహిళలకు అప్పగించవద్దన్నారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, కిష్టారెడ్డి, సీఈవో సాయిలు తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జండిగే హన్మండ్లు శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. మండలంలోని అచ్చాయపల్లి, రామక్కపల్లి గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. కొలతల ప్రకారం నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు. దీంతోపాటు గ్రామంలోని నర్సరీలను ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరాములు, ఈజీఏ ఈసీ సాయిలు, టీఏ సంతోష్ తదితరులున్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన నేతలు




లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఎమ్మెల్సీ కవితను కలిశారు. రామారెడ్డిలోని కాలభైరవ స్వామి ఆలయాన్ని సందర్శించుకున్న కవితను లింగంపేట బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు దివిటి రమేశ్, గన్నూనాయక్, రూప్‌సింగ్, సత్యం ఉన్నారు.

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



లింగంపేట(ఎల్లారెడ్డి) : జిల్లాలోని సహకార బ్యాంకుల్లో రుణాలు తీసున్న రైతులు ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు జీఎం లింబాద్రి అన్నారు. లింగంపేటలోని సహకార బ్యాకును శనివారం ఆయన సందర్శించారు. జిల్లాలోని సహకార బ్యాంకుల్లో రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు, వ్యాపార, వాణిజ్య తదితర రుణాలు బకాయిలు ఉన్న వారికి వన్ టైమ్ సెటిల్మెంట్(ఓటీఎస్)ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఓటీఎస్ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా రూ. 53కోట్ల బకాయిలు వసూలు అయినట్లు తెలిపారు. లింగంపేట బ్యాంకు పరిధిలో రూ. 3కోట్ల బకాయిలు వసూలు అయ్యాయన్నారు. ఏప్రిల్ నుంచి రుణాలు చెల్లించే వారికి ఓటీఎస్ వర్తించదన్నారు. చైర్మన్ దేవేందర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ కుమారస్వామి, సీఈవో పెంటయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల సర్వే పనులకు మినహాయింపు ఇవ్వాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలు, తండాల్లో చేపట్టే రేషన్ కార్డుల సర్వే నుంచి తమను మినహాయించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈమేరకు వారు శనివారం ఎంపీడీవో నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే కార్యదర్శులకు పనిభారం పెరిగిందన్నారు. పనిభారం తగ్గించి, సమస్యలను పరిష్కరించాలని వారు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ హాజరు సమస్యను పరిష్కరించాలి


పెద్దకొడప్‌గల్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధిహామీ కూలీలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): నాలుగు రోజుల నుంచి తమకు ఆన్‌లైన్‌లో హాజరు వేయడం లేదని వెంటనే సమస్యను పరిష్కరించాలని ఉపాధిహామీ కూలీలు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వారు పెద్ద కొడప్‌గల్ మండల పరిషత్ కార్యాలయానికి చేరుకొని నిరసన తెలిపారు. ఈసందర్భంగా కూలీలు మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన ఉపాధి హామీ కూలీలకు సిబ్బంది ఈ వారంలో రెండు రోజులు మాత్రమే ఆన్‌లైన్‌లో హాజరు వేశారని, నాలుగు రోజుల నుంచి ఆన్‌లైన్‌లో హాజరు వేయడం లేదన్నారు. దీంతో తాము చేసిన పనికి డబ్బులు వస్తాయో లేదని ఆందోళన చెందుతున్నామన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఏపీవో సుదర్శన్‌ను కూలీలు నిలదీశారు. ఏపీవో మాట్లాడుతూ.. సాంకేతిక లోపం కారణంగా ఆన్‌లైన్‌లో హాజరు నమోదు కాలేదన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించామని, కూలీలందరికీ చేసిన పనికి తప్పకుండా డబ్బులు వస్తాయని తెలిపారు. దీంతో కూలీలు ఆందోళనను విరమించారు.

ఉపాధి పనుల తనిఖీ

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం లొంగన్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. పని ప్రాంతాల వద్ద వసతులతోపాటు సీసీరోడ్ల నిర్మాణ పనులు తెలుసుకున్నారు. నర్సరీలో చెట్ల పెంపకంపై దృష్టిసారించాలని ఈజీఎస్ సిబ్బందికి ఆయన సూచించారు. పంచాయతీ కార్యదర్శి అనురాధ తదితరులు ఉన్నారు.

ఎండిన పంటల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



నస్రుల్లాబాద్(బాన్సువాడ): 'ఎత్తిపోయిన బోర్లు.. ఎండిన పంటలు' అన్న శీర్షికన సాక్షిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. మండలంలోని మైలారం గ్రామ శివారులో ఎండిన పంటపొలాలను ఏవో భవాని శనివారం పరిశీలించారు. గతంలో కన్నా ముందుగానే పంటలు ఎండిపోయాయని తమను ఆదుకోవాలని రైతులు ఆమెను కోరారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని, రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆమె తెలిపారు.ఏఈవో గోపాల్, రైతులుగంగారాం, సాయిలు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఏకకాల ఎన్నికలతోనే దేశాభివృద్ధి


రామారెడ్డిలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు


చిన్నమల్లారెడ్డిలో మాట్లాడుతున్న సంతోష్‌రెడ్డి

రామారెడ్డి: 'ఒకే దేశం ఒకే ఎన్నిక'తో దేశాభివృద్ధి మరింత జరుగుతుందని మండల బీజేపీ అధ్యక్షుడు కట్ట ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం 'ఒకే దేశం ఒకే ఎన్నిక'పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయాన మాట్లాడుతూ.. దేశమంతా ఏకకాల ఎన్నికలు నిర్వహించడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నాయకులు కృష్ణ యాదవ్, గడ్డం ప్రసాద్, పందుల గోపి, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నమల్లారెడ్డి గ్రామంలో..

కామారెడ్డి టౌన్: మండలంలోని చిన్నమల్లారెడ్డిలో శనివారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో 'ఒకే దేశం ఒకే ఎన్నిక'పై అవగాహన సదస్సు నిర్వహించారు. బీజేపి జిల్లా కార్యదర్శి సంతోష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక స్థిరత్వం కోసం జమిలీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. మండల అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి



నిజాంసాగర్(జుక్కల్): ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని రంగంపేట పీఠాధీశులు మాధవానంద సరస్వతి స్వామిజీ అన్నారు. మండలంలోని అంజనాద్రి ఆలయం వద్ద శనివారం నిర్వహించిన శతరుద్ర పారాయణ మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తల్లిదండ్రుల సేవ చేస్తూ దైవ కార్యాలలో ముందుండాలన్నారు. పట్లోళ్ల దుర్గారెడ్డి, రమేష్‌గౌడ్, అంజనాద్రి ఆలయ నిర్మాణ కర్త పట్లోళ్ల కిషోర్‌కుమార్, ఆనంద్‌కుమార్, అజయ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కాళికాదేవి విగ్రహం ఊరేగింపు



భిక్కనూరు: మండలకేంద్రంలో శనివారం మనుమయ సంఘం ఆధ్వర్యంలో కాళికాదేవి విగ్రహ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. బాజాభజంత్రీలతో అమ్మవారి విగ్రహన్ని వాహనంపై ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. మహిళలు అమ్మవారి విగ్రహానికి మంగళహారతులతో స్వాగతం పలికారు. నిర్వాహకులు ప్రజలకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని వజ్జపల్లిలో ఏప్రిల్ 2నుంచి 4వరకు నిర్వహించే రాజరాజేశ్వర స్వామి ఆలయ 10వ వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ, పల్లకీసేవ నిర్వహించారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కామారెడ్డి రూరల్: టేక్రియాల్‌లో విద్యుత్ సరఫరాలో సమస్యను తీర్చేందుకు 63కేవీ నుంచి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను నూతనంగా ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఈ శ్రావన్‌కుమార్ తెలిపారు. శనివారం టేక్రియాల్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉగాది ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు


చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి


లింగంపేట మత్తడిపోచమ్మ ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ రవీందర్


ఎల్లారెడ్డిలో ముస్తాబైన పోచమ్మ ఆలయం


కోమలంచలో ముస్తాబైన నల్లపోచమ్మ ఆలయం

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాల్లోని ఆలయాలను ఉగాది ఉత్సవాల సందర్భంగా స్థానిక వీడీసీలు, ఆలయ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతల ఆలయాలకు రంగులు వేసి, పచ్చని పందిళ్లు వేశారు. ఆలయాల చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన, జాతర, పలు కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు ఉంటాయని ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు. మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద ఉగాది సందర్భగా నిర్వహించే ఎడ్ల బండ్ల ప్రదర్శన ప్రాంతాన్ని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి శనివారం పరిశీలించారు. దోమకొండ మండల కేంద్రంలో జీపీ కార్యదర్శి యాదగిరితో కలిసి తహసీల్దార్ సంజయ్‌రావ్ వివిధ కాలనీల్లో పర్యటించారు. ఉగాది సందర్భంగా ఎడ్లబండ్లు తిరిగే ప్రాంతాలను శుభ్రం చేయించారు. ఎల్లారెడ్డిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో నేడు సాయంత్రం పంచాగ శ్రవణ కార్యక్రమం ఉంటుందని వైశ్యసంఘం జిల్లా అధ్యక్షులు కంచర్ల బాలకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో నల్లపోచమ్మ ఆలయం జాతరకు ప్రత్యేకంగా ముస్తాబైంది. మూడురోజులపాటు సాగే ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లను చేశారు. లింగంపేట సమీపంలోని మత్తడిపోచమ్మ ఆలయం వద్ద భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ తెలిపారు. శనివారం ఆయన మత్తడి పోచమ్మ ఆలయాన్ని సందర్శించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు.




గోపాల్‌పేటలో నల్లపోచమ్మ ఆలయం.. తాడ్వాయి శివారులోని గ్రామ దేవతల ఆలయం.. దోమకొండలో పరిసరాలను శుభ్రం చేయిస్తున్న అధికారులు

ముప్పై ఏళ్లుగా పంచాంగ శ్రవణం



బాన్సువాడ: బాన్సువాడలోని ఈశ్వరుడి ఆలయంలో జపాల చంద్రశేఖర్ శర్మ ముప్పై ఏళ్లుగా పంచాంగ శ్రవణం చేస్తున్నారు. ప్రతీ ఏడాది ఉగాది రోజున సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఈశ్వరుడి ఆలయంలో పంచాంగంలో ఉన్న విషయాలను భక్తులకు వినిపిస్తారు. బాన్సువాడలోని ఈశ్వరుడి ఆలయంతోపాటు అయ్యప్ప ఆలయం, వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటి, రామాలయంలో పంచాంగ శ్రవణం చేస్తారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉగాది సంబురాలు


అయిలాపూర్ పాఠశాలలో వేదపండితుడి వేషధారణలో హెచ్‌ఎం, పక్కన విద్యార్థులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లు శనివారం ఒకరోజు ముందుగానే ఉగాదిసంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా పంచాంగ శ్రవణం చేశారు. అలాగే ఉగాది పచ్చడిని తయారు చేసి విద్యార్థులకు అందజేశారు. అయిలాపూర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వేదపండితుడి వేషధారణలో పంచాంగం వినిపించారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని విజన్ జూనియర్ కళాశాలలో శనివారం తెలంగాణ రచయితల సంఘం (తెరసం) ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ.. కవులు విభిన్న సంస్కృతులకు వారసులని, సాహిత్యం ద్వారానే సమాజంలో సమైక్యత, సామరస్యత నెలకొంటుందన్నారు. కవి, రచయిత సిరిగాద శంకర్, రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్, కవులు అశోక్‌కుమార్, తిరుమల కైలాస్, రమేష్, రామకోటి, నర్సింలు, పూర్ణచందర్‌రావు, పార్వతి ఉన్నారు.

సంక్షిప్తం

బాన్సువాడలో చలివేంద్రం ప్రారంభం



బాన్సువాడ: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శనివారం చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు ప్రారంభించారు. సిబ్బంది సతీష్ తదితరులు ఉన్నారు.

నియామకం



భిక్కనూరు: భారతీయ మజ్దూర్ సంఘ్ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన రవీందర్ రెడ్డి నియమితులయ్యారు. ఈసందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీడీ కార్మికులు తనపై నమ్మకంతో సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని అన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులను శనివారం బీజేపీ నాయకులు ప్రారంభించారు. స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండలంలో..



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని వెల్లుట్లపేటలో శనివారం కాంగ్రెస్ నాయకులు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా, నాయకులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాలలో శనివారం బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి అందజేశారు. నాయకులు షౌకత్‌అలీ, అఖిల్‌రావు, మేకల రాజు, సుధాకర్‌రావు, రాజేందర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయ సామగ్రి అందజేత



రామారెడ్డి: మండలంలోని మద్దికుంట మండల పరిషత్ పాఠశాలకు శనివారం యునిమనీ ఫైనాన్స్ సర్వీస్ కంపెనీ ఆధ్వర్యంలో రూ. 25వేల గ్రంథాలయ సామగ్రిని అందజేశారు. హెచ్‌ఎం రాజన్న, బ్రాంచ్ మేనేజర్ బొమ్మెడీ సంతోష్‌రెడ్డి, రీజినల్ మేనేజర్ రాజ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

అనారోగ్యంతో వ్యాపారవేత్త మృతి



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త గోవింద్ ప్రసాద్ జంవార్ (పప్పుసేట్) అనారోగ్యంతో శనివారం మృతి చెందినట్లు మార్వాడీ సమాజ్ సభ్యులు, కుటుంబీకులు తెలిపారు. పప్పుసేట్ మద్నూర్‌లో పత్తి ఫ్యాక్టరీ, పత్తి వ్యాపారం, సరిహద్దులో ఉన్న దేగ్లూర్‌లో వ్యాపారవేత్తగా పేరుతెచ్చుకున్నారు. ఆదివారం మద్నూర్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తామని మార్వాడీ సమాజ్ సభ్యులు తెలపారు.

ఈద్గా వద్ద ప్రార్థనలకు ఏర్పాట్లు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెద్దవాగు వద్దగల ఈద్గా పరిసరాలను శుభ్రం చేయించి రంజాన్ ప్రార్థనలకు సిద్ధం చేస్తున్నట్లు ఎంపీవో మలహరి తెలిపారు. శనివారం ఆయన పనులను పరిశీలించారు.

కరపత్రాల ఆవిష్కరణ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శనివారం 'మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ' కార్యక్రమ కరపత్రాలను కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య ఆవిష్కరించారు. ఏప్రిల్ 3న మండల కేంద్రంలో నిర్వహించనున్న బుద్ధుడు, జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం హాజరవుతారన్నారు.